క్లుప్తంగా

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి



క్యాంప్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ సుభాన్

పగిడ్యాల: విభిన్న ప్రతిభావంతులైన పిల్లల సంక్షేమం కోసం భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సుభాన్ అన్నారు. బుధవారం స్థానిక భవిత కేంద్రంలో ఫిజియోథెరపిస్టు కృష్ణప్రియ నిర్వహిస్తున్న క్యాంప్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ క్యాంప్‌లో నేర్పించిన విధంగా ఇంటి వద్ద పిల్లలకు సాధన చేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. వైకల్యం పిల్లకు శాపం కారాదని వారిలో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు రామకృష్ణయ్య, అరుణకుమారి తదితరులు ఉన్నారు.

వృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ

ఆత్మకూరు: పట్టణంలోని మానవతా నిలయం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు వెంకటగణేష్ ఆధ్వర్యంలో నెలకు సరిపడే నిత్యావసర సరుకులను బుధవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 3 సంవత్సరాలుగా వృద్ధాశ్రమంలో వృద్ధులకు తన వంతుగా నిత్యవసర వస్తువులు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం యువజన సంఘం నాయకులు సాయికృష్ణ, గౌతమ్, అరుణ్‌కుమార్, శ్రీకాంత్, మోహన్, ఆశ్రమ నిర్వాహకులు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.,

గుడిసె దగ్ధం

పాములపాడు: కొత్తపల్లి మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో నాయినిగారి రమణమ్మకు చెందిన గుడిసె బుధవారం తెల్లవారుజామున దగ్ధమైంది. బతుకుదెరువు కోసం బాధితురాలు కుటుంబ సమేతంగా గుంటూరు ప్రాంతంలో పండుమిరప తెంపేందుకు వెళ్లింది. కాగా రాత్రి సమయంలో ప్రమాదవశాత్తు గుడిసె అంటుకొని ఇంట్లోని నిత్యావసర సరుకులు, టీవీ, ఫ్రిజ్, ధాన్యం బస్తాలు పూర్తిగా కాలిపోయాయి. ఉదయం చుట్టు పక్కల వారు ఇళ్లలో నుంచి బయటకు రాగానే గుడిసె కాలి బూడిదై మొండిగోడలతో ఉన్న దృశ్యం కంట పడింది. దాదాపు లక్షరూపాయల మేర ఆస్తి నష్టం సంభవించి ఉండొచ్చని స్థానికులు పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



మమత

ఆత్మకూరు: పట్టణంలోని డీపాల్ హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న మమత అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ ఆనంద్ బుధవారం తెలిపారు. ఈమె కాకినాడలో ఈ నెల 28 నుంచి 30 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయులు మమతను అభినందించారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

మహానంది: ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉంటామని తిమ్మాపురం సర్పంచ్ కల్లె శ్రీలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యురాలు స్వరూప తెలిపారు. తిమ్మాపురం గ్రామంలో బుధవారం రాత్రి ఫాగింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దోమల ద్వారా వివిధ రకాల సీజనల్ వ్యాధుల ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఇళ్ల పరిసరాల్లో మురుగునీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జెండా వందనం

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద గురువారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అంజాద్ అలీ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే శిల్పా ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయం వద్ద జాతీ య జెండా ఆవిష్కరణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఉదయం 9 గంటలకు జెండా ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు గోవాలో జరిగిన ఇంటర్నేషనల్ సిటోరియో కరాటే పోటీల్లో రాష్ట్రానికి చెందిన కరాటే క్రీడాకారులు ప్రతిభ చూపించి పతకాలు సాధించారని ఏపీ కరాటే అసోసియేషన్ టీం మేనేజర్ షేక్‌నూర్ బాషా బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గోవాలోని మాబుసా పెద్దెం ఇండోర్ స్టేడియంలో ఈనెల 21, 22, 23 తేదీల్లో కరాటే పోటీల్లో రాష్ట్రం నుంచి 53 మంది క్రీడాకారులు వివిధ అంశాల్లో పాల్గొని 36 బంగారు, 12 వెండి, 5 కాంస్య పతకాలు సాధించారని చెప్పారు. వీరికి ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మహానంద్ అశోడ్కర్ మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారని వివరించారు.

ఓటు వజ్రాయుధం లాంటిది

- ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి
- అధికారులతో ప్రతిజ్ఞ చేయించిన ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటామని అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

జూపాడుబంగ్లా: ఓటు వజ్రాయుధం లాంటిదని, ఓటు హక్కు ఉన్నవారందరూ తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నందికొట్కూరు పట్టణంలో అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు.ఆయన మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన యువతీ, యువకులు తప్పనిసరిగా ఓటుహక్కు ను నమోదు చేయించుకోవాలన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ప్రతి ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలకు వెళ్లి నిస్వార్థంగా సమాజానికి ఉపయోగపడే వారికి ఓటు వేయాలని సూచించారు. ఓటుకు మాత్రమే సమాజాభివృద్ధికి దోహదపడే నాయకులను ఎన్నుకునే సత్తా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, ఉర్దూ అకాడమి డైరెక్టర్ షకూర్‌మియ్యా, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, డీటీ సత్యనారాయణ, సహకారసొసైటీ చైర్మన్లు హుసేనయ్య, హరిసర్వోత్తమరెడ్డి, సీఐ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ తెలిపారు. బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేశారు. అలాగే నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, డాక్టర్ రఘుపతిరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని బసిరెడ్డి డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కరస్పాండెంటు వీఎస్ సత్యనారాయణ, డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటర్ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పాములపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ రత్న రాధిక ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే కొత్తపల్లి మండల కేంద్రంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మనోహర్, పీఎల్ ఆర్‌డీటీ పెద్దన్న, ఆర్ఐ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు

పగిడ్యాల: 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి భారత రాజ్యాంగం హక్కు కల్పించిందని తహసీల్దార్ భారతీ, ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. 13వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండు వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహిస్తారని ప్రజా ప్రతినిధులుగా మంచివారిని ఎన్నుకోవడానికి ఓటు హక్కు కలిగి ఉండాలని వివరించారు. ఎంఈఓ సుభాన్, డిప్యూటీ తహసీల్దార్ మురళి, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాములపాడులో ఓటరు దినోత్సవ కర పత్రాలు ప్రదర్శిస్తున్న అధికారులు, ప్రజలు

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

ఆత్మకూరు: మండలంలోని సంజీవనగర్ తండాలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పంచాయితీ కార్యదర్శి ప్రభాకర్,మహిళా కానిస్టేబుల్ మైమున్నీసా ఆధ్వర్యంలో 'నా దేశం– నా ఓటు' అనే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేపట్టారు. గ్రామంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు.

బండిఆత్మకూరు: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోని ప్రజా స్వామ్య పరిరక్షణకు పాటుపడాలని తహసీల్దారు ఉమారాణి అన్నారు. బుధవారం బండిఆత్మకూరులో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో కరిముల్లా, ఈవోఆర్డీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేపు క్యాడెట్ జూడో జిల్లా జట్టు ఎంపిక పోటీలు

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణంలోని నవనంది హైస్కూల్లో ఈనెల 27న జిల్లా క్యాడెట్ జూడో జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా జూడో సంఘం సీఈఓ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోటీలకు ఎంపికయ్యే బాల, బాలికలు బర్త్ సర్టిఫికేట్, ఆధార్‌కార్డు, 4 పాస్‌ఫోటోలు వెంట తీసుకొని రావాలని సూచించారు. క్యాడెట్ ఎంపిక పోటీల్లో పాల్గొనే వారు 2005, 2006, 2007 సంవత్సరాల్లో జన్మించిన వారై ఉండాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరి 3 నుంచి 5 వరకు జరిగే రాష్ట్రస్థాయి చాపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని కార్యదర్శి శ్రీకాంత్ తెలిపారు.

1న నందికొట్కూరులో దుకాణాల వేలం

జూపాడుబంగ్లా: నందికొట్కూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న దుకాణాలకు ఫిబ్రవరి 1న వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శోభారాణి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.వెయ్యి డీడీలు తీయాలన్నారు. ఈ మొత్తం తిరిగి చెల్లించరన్నారు. డీడీలను, ఆధారుకార్డు జిరాక్సు కాపీని ఈనెల 31తేదీ సాయంత్రం 4గంటల్లోగా ఎంపీడీఓ కార్యాలయంలో అందజేసి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. దుకాణాలను మూడేళ్ల కాలపరిమితికి బాడుగకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు వేలం ప్రారంభిస్తామని చెప్పారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

జూపాడుబంగ్లా: నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలో (కమ్యూనిటీ హెల్త్‌సెంటర్) వైద్యులు ఎల్లవేళలా రోగులకు అందుబాటులో ఉంటూ, వారికి మెరుగైన వైద్యచికిత్సలు నిర్వహించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ సూచించారు. బుధవారం హాస్పిటల్ ఆవరణలో ఆసుపత్రి డెవలప్‌మెంటు కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సీహెచ్‌సీ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది ఉన్నందున ఆసుపత్రికి వచ్చిన రోగులను వెంటనే పరీక్షలు నిర్వహించి, వైద్యం అందించేందుకు కృషి చేయాలన్నారు. రాత్రివేళల్లో రోగులు ఆసుపత్రికి వచ్చిన వెంటనే వైద్యులు స్పందించి చికిత్స అందించాలని, కర్నూలు ఆసుపత్రికి వెళ్లాలని సూచించి చేతులు దులుపుకోవద్దని సూచించారు. అలాగే సదరం క్యాంపులో దివ్యాంగులకు తాత్కాలిక సర్టిఫికెట్లు కాకుండా శాశ్వత సదరం సర్టిఫికెట్లు అందజేసి, వారికి పింఛన్లు మంజూరయ్యేందుకు సహకరించాలని వైద్యులను కోరారు. సమావేశంలో డాక్టర్ రాయుడు, ఎంపీడీఓ శోభారాణి, మున్సిపల్ కమిషనర్ కిషోర్, ఆసుపత్రి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వసంత పంచమికి ఏర్పాట్లు పూర్తి

- కొలనుభారతిలో భక్తులకు సకల సౌకర్యాలు
- చిన్నారుల అక్షరాభ్యాసానికి ప్రత్యేక కౌంటర్లు
- శ్రీశైల దేవస్థానం తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్న ఎమ్మెల్యే ఆర్థర్, ఈఓ లవన్న



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిరి

పాములపాడు: కొత్తపల్లి మండలంలోని కొలను భారతి పుణ్య క్షేత్రంలో వసంత పంచమి, అమ్మవారి పుట్టినరోజు పండుగకు సంబంధించి అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు ఈఓ మోహన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుంచి వసంత పంచమి వేడుకలకు దాదాపు 25వేల మంది అమ్మవారి దర్శనానికి వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తుల కోసం క్యూలైన్లు, ఫ్లవర్ డెకరేషన్, పెండాల్స్, షామియానాలు, మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు గదులు, మరుగుదొడ్లు, తాగునీరు తదితర ఏర్పాట్లు చేశామన్నారు. చిన్నారుల కోసం ప్రత్యేకంగా అక్షరభ్యాసం కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. 12 మంది పురోహితులు ఆలయంలో అందుబాటులో ఉంటారని చెప్పారు. ఉదయం 6 గంటలకు శ్రీశైలం దేవస్థానం నుంచి తీసుకువచ్చిన పట్టు వస్త్రాలను ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ , శ్రీశైలం దేవస్థానం ఈఓ లవన్న చేతుల మీదుగా సరస్వతిదేవి అమ్మవారికి సమర్పిస్తారన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

కొలనుభారతీ దేవి క్షేత్రంలో వసంతి పంచమి, అమ్మవారి పుట్టిన రోజు పండుగకు భక్తుల కోసం చేసిన ఏర్పాట్లను బుధవారం కొత్తపల్లి ఎంపీడీఓ మేరి, సర్పంచు చంద్రశేఖర్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఆలయం ఆవరణంలో పందిళ్లు, క్యూలైన్ల కోసం బారీ కేడ్లు, రహదారి మరమ్మతులు, ఆలయం చుట్టూపక్కల పారిశుద్ధ్య పనులు చేపట్టడం జరిగిందని చెప్పారు. ఆమె వెంట ఏఈ రామచంద్రయ్య, ఏపీఓ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దేవజయమ్మ తదితరులు ఉన్నారు.

పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తాం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

ఆత్మకూరు: పట్టణాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ.. ఆత్మకూరును అభివృద్ధి పథంలో తీసుకువెళ్లేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సహకారంతో ప్రతి సచివాలయానికి విడుదలయ్యే రూ.20 లక్షలతో అదే సచివాలయపరిధిలో పనులు చేపడతామని చెప్పారు. ఇప్పటివరకు 20 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయ్యిందని, మిగిలిన వార్డుల్లో ఈ కార్యక్రమం పూర్తయితే ప్రభుత్వ నిధులు విడుదల అవుతాయని చెప్పారు. పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా చేసేందుకు ప్లాస్టిక్‌ని నిషేధిస్తున్నామని చెప్పారు. పట్టణంలోని 7, 6 వార్డులలో రూ.20లక్షలు, 21, 16, 8, 23 వార్డుల్లో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను పూర్తి చేస్తామన్నారు. పట్టణంలోని 13 సచివాలయాల పరిధిలోని వార్డులో అభివృద్ధి చేపడతామని తెలిపారు. అనంతరం 12 అంశాలపై తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కో ఆప్షన్ సభ్యులు రషీద్, వార్డుకౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు

లక్ష్యాలను అధిగమించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి

మిడుతూరు: జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాల వేగవంతం చేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను ఉగాది పర్వదినం లోపు అధిగమించాలని ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న లే అవుట్లలో ఇంటి నిర్మాణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇంటి నిర్మాణాలపై పురోగతి లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉగాది పర్వదినానికి ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకొని గృహప్రవేశాలకు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవణమ్మ, ఈఓఆర్డీ ఫక్రుద్దీన్, కార్యాలయ ఏఓ దశరథరామయ్య, పీఆర్, హౌసింగ్, విద్యుత్, ఏఈలు ప్రతాపరెడ్డి, రమేష్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓంకార క్షేత్రానికి రూ.7.08 లక్షల ఆదాయం

బండిఆత్మకూరు: ఓంకార క్షేత్రంలో బుధవారం దేవస్థానం అధికారులు టెంకాయల వేలం పాట నిర్వహించారు. ఈ వేలంపాట ద్వారా రూ.7.08 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ నాగ ప్రసాద్ తెలిపారు. గతేడాది టెంకాయల వేలంలో రూ.6.70 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. గతేడాదికంటే ఈ ఏడాది అదనంగా రూ.38 వేలు వచ్చిందని వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ విశ్వనాథ్‌రెడ్డి, తనిఖీ అధికారి హరిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



శుద్ధజల ట్యాంక్‌లను పరిశీలిస్తున్న ఈఓ లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థాన రక్షిత మంచినీటి సరఫరా పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఈఓ ఎస్ లవన్న సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మహాశివరాత్రి ఏర్పాట్లలో భాగంగా దేవస్థాన రక్షిత మంచినీటి సరఫరాను పరిశీలించారు. ఫిబ్రవరి 11 నుంచి 22 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివగంగ జలప్రసాద (మినరల్ వాటర్ ప్లాంట్)ను, మల్లికార్జునసదన్, గంగా గౌరీ సదన్, శివదీక్షా శిబిరాలు, కల్యాణకట్ట, ఘంటామఠం, మల్లమ్మ కన్నీరు, జిల్లా పరిషత్ అతిథిగృహం, జగద్గురు మఠం, దేవస్థానం వైద్యశాల, దేవస్థాన అన్నప్రసాద వితరణ, టూరిస్ట్ బస్టాండ్ తదితర చోట్ల ఏర్పాటు చేసిన ప్లాంట్లను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో పూర్తిశాస్త్రీయ ప్రమాణాలను పాటించాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి క్లోరినేషన్ ప్రక్రియపై శ్రద్ధ వహించాలని ఆదేశించారు. నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈఈ నాగేశ్వరరావు, డీఈఈ నరసింహారెడ్డి, చంద్రశేఖరశాస్త్రి, మల్లికార్జునప్రసాద్, పీఆర్వో టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు మౌలిక వసతులు కల్పిస్తాం



గిరిజనులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి

మహానంది: గిరిజనులకు మౌలిక వసతులు కల్పిస్తామని ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి తెలిపారు. మహానంది సమీపంలోని చెంచులక్ష్మి గిరిజన గూడేన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఆయన సందర్శించారు. ఇటీవల గిరిజనులు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ మేరకు ఆయన ఆదేశించడంతో పీఓ రవీంద్రారెడ్డి, తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, అధికారులు గూడెం చేరుకుని గిరిజనులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఎన్నో ఏళ్లుగా అడవితల్లిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని, మాకు ఇచ్చిన భూములు కాపాడుకునేందుకు ఇక్కడే ఉంటూ పోరాటం చేస్తున్నామని గిరిజనులు తెలిపారు. అధికారులు స్పందించి మా భూములకు నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

'వర్గీకరణపై తేల్చుకుందాం'

పాములపాడు: ఎస్సీ వర్గీకరణపై తాడో పేడో తేల్చుకుందామని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ కోటా ప్రభాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫిబ్రవరి 13న దేశ ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి అమీత్‌షా హైదరాబాదుకు రానున్నారన్నారు. వారిని అడ్డుకునేందుకు జాతీయ రహదారి దిగ్బంధం చేపట్టాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 12న మాదిగలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా నాయకులు నాగరాజు, ఆ సంఘం మండల ఇన్‌చార్జ్ పాములపాడు నాగరాజు, కనకం నాగరాజు, కనకం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

త్రోబాల్ పోటీల లోగో ఆవిష్కరణ


నంద్యాల(వ్యవసాయం): ఈనెల 28వ తేదీ నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి ఏజీఎఫ్ త్రోబాల్ పోటీల లోగోను స్థానిక గురురాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గురురాఘవేంద్ర ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ దస్తగిరిరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 66వ స్కూల్ గేమ్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్–14 2022–23 బాలుర, బాలికల త్రోబాల్ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీలను 30వ తేదీ వరకు స్కూల్ మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13 జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు, 50మంది అఫీషియల్స్, 70మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొంటారని చెప్పారు.

యువరైతు ఆత్మహత్యపై విచారణ

జూపాడుబంగ్లా: మండలంలోని మండ్లెం గ్రామంలో బాలగోవిందరెడ్డి (24) అనే యువరైతు ఆత్మహత్యపై బుధవారం ఏఓ కృష్ణారెడ్డి, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, వీఆర్వో ఈశ్వరయ్య విచారణ చేపట్టారు. బాలగోవిందరెడ్డి ఇంటికి వెళ్లిన అధికారులు తండ్రి మురళీధర్‌రెడ్డితో పాటు చుట్టుపక్కల వారిని అడిగి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరాతీశారు. ఏఓ మాట్లాడుతూ మృతుడు బాలగోవిందరెడ్డి పేరున 65సెంట్ల పొలం ఉండగా కౌలుకు 18 ఎకరాల పొలం తీసుకొని ఉల్లి, మిరప, పత్తి, మొక్కజొన్న పంటలు సాగుచేసినట్లు తెలిపారు. సాగుచేసిన పంటలు సక్రమంగా పండకపోవటంతో పంటల సాగుకు, కుటుంబ పోషణకు ప్రైవేటు వ్యక్తుల వద్ద రూ.10లక్షలు, గోల్డ్‌లోన్ రూ.5లక్షలు, బ్యాంకులో క్రాప్‌లోను రూ.80వేల మేర అప్పులు చేసినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించినట్లు తెలిపారు. అయితే మృతుడు పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నట్లు అతని పేరున కౌలురైతు గుర్తింపుకార్డు లేనట్లు విచారణలో తేలిందన్నారు.

తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలివ్వడమే జగనన్న ధ్యేయం
- పట్టణంలోని కుర్వపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



అవ్వతో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జూపాడుబంగ్లా: రాజకీయ గుర్తింపు టీడీపీ నాయకులు నిరంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. బుధవారం నందికొట్కూరు పట్టణంలోని 2వార్డు సచివాలయం పరిధిలోని కుర్వపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళ్లి వారికి ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి వారు పొందిన లబ్ధివివరాలను తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న సీఎం అయ్యాక అమలు చేసిన, చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలగుండెల్లో చెరగని ముద్రవేసుకున్నాయన్నారు. అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా అర్హులైన వారందరికీ ఇంటివద్దకే పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. టీడీపీ పాలనలో పచ్చచొక్కాలు వేసుకొన్న వారికి, ముడుపులు సమర్పించుకొన్న వారికి మాత్రమే సంక్షేమ పథకాలు అందేవన్నారు. ప్రతిపక్షాలు ఎంత గగ్గోలు పెట్టినా జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలే మళ్లీ ఆయనకు పట్టం కడతాయని ధీమా వ్యక్తం చేశారు. కాలనీలో పలు సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. వాటిని వెతనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

గడప గడపకు హాజరుకాకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అధికారులు గైర్హాజరైతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే హెచ్చరించారు. పట్టణంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంఈఓ ఫైజున్నిసా రాకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరుపట్టికను పరిశీలించి గైర్హాజరైన వారి పేర్లు నోట్ చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, ఎంపీడీఓ శోభారాణి, సీఐ విజయభాస్కర్, ఉర్దూ అకాడమి డైరెక్టర్ షకూర్‌మియ్యా, కౌన్సిలర్ ధర్మారెడ్డి, సహకారసొసైటీ చైర్మన్లు హుసేనయ్య, హరిసర్వోత్తమరెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళావిభాగ నాయకురాలు వనజాక్షి, తస్లీమాబేగం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఆత్మకూరు డీపీఓ కవిత

పగిడ్యాల: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు తప్పవని ఆత్మకూరు డివిజనల్ అధికారి కవిత హెచ్చరించారు. బుధవారం స్థానిక సంతమార్కెట్ ఆవరణలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆమె పర్యవేక్షించి క్లాప్ మిత్రలకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో చెత్తచెదారం పేరుకు పోకుండా ఇంటింటి చెత్త సేకరణను పకడ్బందీగా చేపట్టాలన్నారు. డ్రైనేజీల్లో పూడికను తొలగించి దోమల నిర్మూలన చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డిని ఆదేశించారు. అలాగే ఆయా గ్రామాల్లో నిర్మాణ దశలో ఉన్న సాలీడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ షెడ్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. డీపీఓ వెంట ఎంపీడీఓ వెంకటరమణ, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, ఆరోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

స్టేజ్ కన్వర్షన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

జగనన్న ఆదర్శ కాలనీలలో నిర్మిస్తున్న గృహాల స్టేజీ కన్వర్షన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్, భారతీ, హౌసింగ్ ఏఈ జ్యోతి ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

మిడుతూరు: స్థానిక కొత్తపేట కాలనీలోని అమ్మవారి శాల వద్ద బుధవారం జేసీబీ సహాయంతో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ పనులను ఈఓఆర్డీ ఫకృద్దీన్ పరిశీలించారు. ఈఓఆర్డీ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశంలో వేస్టువాటర్ పోయరాదని, చెత్తచెదారం వేయరాదని సూచించారు. కార్యక్రమంలో పీఎస్ సుధీర్, బక్కన్న పాల్గొన్నారు.